# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 05-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్, స్విట్జర్లాండ్ దేశాల మధ్య పెట్టుబడులను మరింత సులభతరం చేసేందుకు ఇరు దేశాలు కలిసి పనిచేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- ❖ పెన్షన్‌దారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

- ❖ నగరాలు, గ్రామాలను పరిశుభ్ర నివాసయోగ్యలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి తోఖన్ సాహు అన్నారు.

- ❖ ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలన్న పిటిషన్లపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది.

======================

రవాణా సాంకేతికతలు, మొబిలిటీ వ్యవస్థలు, మౌలిక సదుపాయాల ప్రోత్సాహం, సహకారం రంగంలో భారత్, స్విట్జర్లాండ్ దేశాలు ఈరోజు పలు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. న్యూఢిల్లీలో స్విట్జర్లాండ్ అధ్యక్షుడు గై పార్మెలిన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీల మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం ఈ ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంయుక్త పత్రికా సమావేశంలో నరేంద్ర మోదీ మాట్లాడుతూ... గత అక్టోబర్‌లో యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (EFTA) దేశాలతో భారత్ చారిత్రాత్మక వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని అమలు చేసిందని అన్నారు. ఐరోపా ఆర్థిక కూటమితో భారతదేశం కుదుర్చుకున్న మొట్టమొదటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇదేనని ప్రధానమంత్రి పేర్కొన్నారు. పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి, ఉమ్మడి శ్రేయస్సు కోసం ఇది ఒక ప్రతిష్టాత్మకమైన చట్రమని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ ఒప్పందం ప్రకారం.. రాబోయే 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించి, 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని ప్రధానమంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

పెన్షన్‌దారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `17వ అఖిల భారత పెన్షన్ అదాలత్`లో ఆయన ప్రసంగిస్తూ.. పెన్షనర్లు ఎదుర్కొంటున్న అనుభవాలు, ఇబ్బందుల నుండి పెన్షన్ పరిపాలన విభాగం నిరంతరం పాఠాలు నేర్చుకుని, ప్రస్తుత వ్యవస్థలోని లోపాలను తొలగించే దిశగా కృషి చేయాలన్నారు. పెన్షన్ సంబంధిత సేవల్లో డిజిటల్ టెక్నాలజీ వినియోగం పెరుగుతోందని చెప్పారు. సాంకేతికత, డిజిటల్ విధానాలు అంతిమంగా పెన్షన్‌దారులకు, వారి కుటుంబాలకు సరళమైన, మరింత అందుబాటులో ఉండే సేవలుగా మారాలని ఆయన స్పష్టం చేశారు. డిజిటల్ గుర్తింపు, ముఖ గుర్తింపు ఆధారిత యంత్రాంగాల ద్వారా ప్రక్రియలను సరళతరం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన `స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్వాగతించారు. వాణిజ్య ఒప్పందాలలో భారత్ అవలంబిస్తున్న వైఖరిని ఇది ప్రతిబింబిస్తోందని చెప్పారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన మ్యూనిచ్ నాయకుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... అన్ని ఒప్పందాల్లో దీనిని అతిపెద్ద ఒప్పందంగా అభివర్ణించారు. సుమారు రెండు వందల కోట్ల ప్రజలు, ప్రపంచ జీడీపీలో నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్థిక వ్యవస్థలు దీని పరిధిలోకి వస్తాయని చెప్పారు. పోటీతత్వానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూస్తూనే... ఈ ఒప్పందం అనుబంధ మార్కెట్ ప్రవేశానికి వీలు కల్పిస్తుందన్నారు. ఈ ఒప్పందం కింద భారతదేశం తన టారిఫ్ లైన్లలో 92.5 శాతాన్ని అందుబాటులోకి తెచ్చిందని, ఇది వాణిజ్య విలువ పరంగా సుమారు 97 శాతానికి సమానమని నిర్మలా సీతారామన్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పర్యావరణ పరిరక్షణ, ఆధునిక అభివృద్ధి అనేవి రెండు వేర్వేరు మార్గాలు కాదని, అవి ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని భారత్ ప్రపంచానికి నిరూపించిందని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `ప్రపంచ ఆవాస దినోత్సవ` వేడుకల్లో కేంద్రమంత్రి తోఖన్ సాహు ప్రసంగిస్తూ... ఇటీవలి కాలంలో భారతదేశం తన విధానాలలో పర్యావరణ సమతుల్యతకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిందన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే సంకల్పంతో దేశం ముందుకు సాగుతోందని, నగరాలు, గ్రామాలను పచ్చగా, పరిశుభ్రంగా, సుస్థిరంగా, నివాసయోగ్యంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన వివరించారు.. ప్రభుత్వం కేవలం విధానాలు, పథకాలను రూపొందించడమే కాకుండా.. వాటిని ఒక విస్తృత ప్రజా ఉద్యమంగా మార్చిందని పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) గ్యానేశ్ కుమార్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేయాలన్న పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈరోజు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా ఎన్నికల సంఘం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందన్న ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ పై సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నారా? లేక సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపై ఈసీతో పాటు సీఈసీ, మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. మొదట ప్రతివాదుల నుంచి స్పందనలు కోరతామని, ఏవైనా చట్టపరమైన నిబంధనలు ఉల్లంఘించబడ్డాయా లేదా అని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. కేవలం వార్తాపత్రికల నివేదికల ఆధారంగా ఏకపక్ష ఉత్తర్వును జారీ చేయలేమని కూడా పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ భద్రత, ప్రాదేశిక సమగ్రతకు ముప్పు వాటిల్లిన సమయంలో రష్యా అనేక విధాలుగా భారత్ కు అండగా నిలిచిందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 62వ మ్యూనిచ్ భద్రతా సదస్సులో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. రష్యాతో భారతదేశానికి చాలా మంచి సంబంధాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఆ వారసత్వమే భారత్-రష్యా సంబంధాలను అనేక విధాలుగా తీర్చిదిద్దిందని చెప్పారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధం నేడు అంతకు మించి విస్తరించాయని, వీటిలో చాలా వరకు ఆర్థిక సంబంధాలు ఉన్నాయని తెలిపారు. రెండు దేశాల మధ్య గణనీయమైన వాణిజ్యం, పెట్టుబడులతో పాటు సైనిక, అణు, అంతరిక్ష అంశాలు కూడా ఉన్నాయని జైశంకర్ తెలియజేశారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనే బృహత్ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రభుత్వం రసాయనాలు, పెట్రోకెమికల్ రంగానికి ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ అన్నారు. న్యూఢిల్లీలో "అడ్వాంటేజ్ భారత్: అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ కెమికల్స్ హబ్" అనే ఇతివృత్తంతో జరిగిన "14వ ఇండియా కెమ్ ఎడిషన్"ను ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అనుప్రియా పటేల్ మాట్లాడుతూ... ప్రపంచ వాణిజ్యం, సరఫరా గొలుసులో అంతరాయాల నేపథ్యంలో ఈ రంగంలో స్వావలంబన ఎంతో అవసరమన్నారు. దేశీయ సామర్థ్యాలను పెంపొందించుకుని, ప్రపంచానికి నమ్మకమైన భాగస్వామిగా ఎదగగల శక్తి భారత్‌కు ఉందని ఆమె అన్నారు. రసాయన, పెట్రోకెమికల్ పరిశ్రమలు నూతన ఆవిష్కరణలు చేయడానికి, పెట్టుబడులు పెట్టడానికి, విస్తరించడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. భారతదేశం ప్రపంచానికి ఒక రసాయన కేంద్రంగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

సంచార్ సాథీ పోర్టల్ ను ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 30 కోట్ల మందికి పైగా వినియోగించుకున్నారని కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలియజేసింది. మే 2023లో మంత్రిత్వ శాఖకు చెందిన టెలికమ్యూనికేషన్స్ విభాగం అభివృద్ధి చేసిన ఈ పోర్టల్.. సులభమైన ఇంటర్‌ఫేస్‌తో అనుమానాస్పద కాల్స్, సందేశాలపై ఫిర్యాదు చేసేందుకు వినియోగదారులకు అవకాశం కల్పించింది. తమ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్‌లు నడుస్తున్నాయో తెలుసుకోవడానికి, తద్వారా పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన హ్యాండ్‌సెట్‌ను బ్లాక్ చేయడానికి కూడా ఈ పోర్టల్ సహాయపడుతుంది. హ్యాండ్‌సెట్ అసలైనదా కాదా అని తెలుసుకోవడానికి కూడా ఇది వినియోగదారులకు ఉపయోగపడుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 71 వేల 909 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 473 పాయింట్ల లాభంతో 72 వేల 382 వద్ద ముగిసింది. నిఫ్టీ 133 పాయింట్లు లాభపడి 22 వేల 555 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96 రూపాయల 29 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =